క్లుప్తంగా

నేత్రపర్వంగా జ్యోతి దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో జ్యోతిదర్శనం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. అయ్యప్పస్వామి వారి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో ఉదయం నెయ్యాభిషేకం, పాలాభిషేకం, ఇతర పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకారం, సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి విశేష హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకారం గావించి స్వామివారికి విశేష అర్చన చేశారు. అనంతరం ఆలయంపైన జ్యోతిని వెలిగించారు. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారి జ్యోతిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానికంగా ఉన్న పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

కనులపండువగా సీతారామ కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యాన సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వరదరాజులు సీతారాముల కల్యాణంను వేదమంత్రాల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం కనుమను పురస్కరించుకుని విశేషంగా గోపూజ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు స్వామి శరణ్ పర్యవేక్షించారు.


రంగవల్లులతో వీడ్కోలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి వేడుకలు బుధవారం ముగిశాయి. మధురానగర్, ముత్యాలంపాడు, మాచవరం, దుర్గాపురం, నెల రోజులుగా ఇంటి ముందు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా రంగురంగుళ రంగవల్లులు తీర్చిదిద్దారు. కనుమ పండుగను పురస్కరించుకుని మహిళలు వారి ఇంటి ముందు రథం ముగ్గులు వేసి సంక్రాంతి పండుగకు వీడ్కోలు పలికారు.

ఘనంగా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షిక వేడుకలు

మేళతాళాలతో గణాచారి ఊరేగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం 8వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అమ్మవారికి లోక కళ్యాణార్థం విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేయించిన అశ్వరథంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, బేతాళ సెట్టులతో మధురానగర్ పురవీధులలో గణాచారి ఊరేగింపు కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో ఏసీపీ దుర్గారావు, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు నెరవేరుతాయని చెప్పారు. అనంతరం గణాచారి ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే బుధవారం సాయంత్రం జ్యోతులతో పల్లకీ సేవ, విశేషంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో లయన్స్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు, శంకర్ గుప్తా, శ్రీనివాసరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా వన్‌టౌన్‌లోని అన్ని ఆలయాలు సందడిగా దర్శనమిచ్చాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి సంక్రాంతి శోభ ఆలయాల్లో దర్శనమిచ్చింది. ప్రధానంగా వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలను నిర్వహించి తిరుప్పావై సేవతో పాటుగా సహస్రనామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా పూలమార్కెట్, ఇతర పూజాద్రవ్యాల ధరలు ఆకాశాన్నింటాయి.

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అండాళ్, లక్ష్మీదేవి అమ్మవార్లను అత్యంత సుందరంగా అలంకరించారు. రంగనాథ స్వామికి, గోదాదేవి స్వామివార్లకు ప్రత్యేక పూజలను చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి రామచంద్రరావులు పర్యవేక్షించారు.

శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో..

కొత్తపేటలోని శ్రీనగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి పలు ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. ముఖ్యంగా ఆలయాన్ని పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. పూజల అనంతరం మధ్యాహ్నం సీతా, లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రమూర్తి ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై ప్రతిష్టించి నగరోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారి ఊరేగింపు బ్రాహ్మణవీధి, నెహ్రూబొమ్మ సెంటర్, కేటీరోడ్డు తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



వేణుగోపాలుని నగరోత్సవంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు

వేణుగోపాలస్వామి వారి ఆలయంలో....

కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్‌లోని శ్రీవేణుగోపాలస్వామి వారి ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి మంగళవారం పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రుక్మిణీ, అండాళ్ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవాన్ని నిర్వహించారు. నగరోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై నెహ్రూబొమ్మ సెంటర్, కేటీరోడ్డు తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



సంక్రాంతి సందర్భంగా విశేషాలంకారంలో పాండురంగస్వామి

పాండురంగస్వామి దేవస్థానంలో...

కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీపాండురంగస్వామి వారి దేవస్థానంలో స్వామివారిని విశేష అలంకారం గావించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పూర్తిగా పూలంగి సేవను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, పీఎన్ఎమ్ 44వ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని మర్రిచెట్టు వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా..ఉల్లాసంగా సాగాయి. కార్మికనేత కుండనాల భాస్కరరావు 20వ వర్ధంతి, ఆయన కుమారుడు అనిల్‌వంశీ సంస్మరణార్థం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను కేబీఎన్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్ ప్రారంభించారు. ఈసందర్భంగా హేమచంద్ మాట్లాడుతూ యువతీ యువకుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతోపాటు వారిలోని ఐక్యతను చాటేందుకు ఆటలపోటీలు దోహదపడతాయన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయ సత్యబాబు మాట్లాడుతూ ఇక్కడ రెండు దశాబ్దాల నుంచి యువతను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుండనాల భాస్కరరావు, కుండనాల అనిల్ వంశీ చిరస్మరణీయులన్నారు. ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్షురాలు కుండనాల శేషుమణి మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేయడంతోపాటు యువశక్తి నిర్వీర్యం కాకుండా వారిని చైతన్యవంతం చేసేందుకు ఏటా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ఆటలు, ముగ్గుల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ జి ఆదిలక్ష్మి, సీఐటీయు నగర కార్యదర్శి ఈవీ నారాయణ, విక్రం లక్ష్మి, సుకుంద, యశశ్విని దేవి, పీ రాజు, కె మస్తాన్, శ్రీను, అప్పలరాజు, పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవంగా ఆళ్వార్ మర్యాదోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీకన్యకా, శ్రీరామ నగరేశ్వరస్వామివార్ల దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని శ్రీకోదండరామస్వామి వారి దేవస్థానంలో ఆళ్వార్ మర్యాదోత్సవాన్ని బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవ ముగింపు కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో వేణుగోపాలస్వామివారిని ఉభయదేవేరులతో అధిష్ఠింపజేసి పూజలు చేశారు. అనంతరం వైష్ణవ సంప్రదాయాన్ని ఆచరించిన ప్రముఖులు 12మంది ఆళ్వార్లను విశేషంగా అలంకరించి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

ఈసందర్భంగా వేణుగోపాలునికి సహస్రనామార్చనలతోపాటు మహిళలు తిరుప్పావైను పఠించి పూజలు చేశారు. వైదిక కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవచార్యులు నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి పర్వదినంతోపాటుగా స్వామి వారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



ఆళ్వార్లుకు పూజలు

పశ్చిమాన్ని కోడిపందేల అడ్డాగా మార్చారు : పోతిన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు సరిపోవన్నట్లుగా తాజాగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పేకాట, కోడి పందేల శిబిరాలను ఏర్పాటు చేసి వాటికి అడ్డాగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేత పోతిన మహేష్ బుధవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. బెజవాడ చరిత్రలో ఎన్నడూ చూడనివిధంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు మూడు కలిసి సంక్రాంతి సంబరాల పేరుతో రెండు బరులు ఏర్పాటుచేసి పశ్చిమ నియోజకవర్గాన్ని జూదానికి అడ్డాగా మార్చాయన్నారు. గొల్లపూడికి చెందిన బొమ్మసాని సుబ్బారావు కనుసన్నల్లో పేకాట, గుండాట, కోడిపందేలు పెట్టి ప్రజల బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారని విమర్శించారు. గోదావరి జిల్లాలను సైతం తలదన్నేలా బహిరంగంగా కోడి పందేలు నిర్వహిస్తుంటే పోలీసులు ఏం చేయలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ మంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు కోడిపందేల బరుల నిర్వహణలో స్వయంగా ఉండటంతో పోలీసులు చేతులెత్తేశారని ఆరోపించారు. బహిరంగంగా కోడికాళ్లకు కత్తులు కట్టి కోట్లాది రూపాయలు చేతులు మార్చుతూ పందేలు వేస్తూ ప్రజలను చెడు వ్యసనాలకు విషసంస్కృతికి బానిసలుగా చేస్తున్నారన్నారు. పండగపూట వారి జేబుల్ని కొల్లగొట్టి కుటుంబాలని పండగలకు దూరం చేస్తున్నారన్నారు. మూడు రోజులుగా సామాన్యుల నుంచి కూటమి నేతలు కోట్లాది రూపాయాలు దండుకుని పోలీసులకు, ఉన్నతాధికారులకు రెండు బరిలపైన అరకోటి వరకు ముట్టచెప్పినట్లు ప్రచారం సాగుతోందని ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజల సంపదని ఈ విధంగా దోచేస్తున్న కూటమి ప్రభుత్వ నాయకుల మీద పోలీసులు చర్య తీసుకోవాలని కోరారు. పండగ పేరున జూదాలను నిర్వహించే కూటమి నాయకులను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళా ఉత్సవ్‌లో స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులకు విక్రయించేందుకు ఫిబ్రవరి 8 నుంచి 16వ తేదీ వరకు మొగల్రాజపురంలోని మొగల్ హాలులో మహిళా ఉత్సవ్-2025ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే ఈ మహిళా ఉత్సవ్‌లో విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ఈ మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోడానికి ఈ మహిళా ఉత్సవ్ చక్కటి వేదిక అని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోగా మొగల్రాజపురంలోని రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమసంస్థ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రశ్నించే వారిపై దాడులు సిగ్గుచేటు

సీపీఐ నేత ఈశ్వరయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజాన్ని తప్పుదారి పట్టించే మూఢవిశ్వాసాల నుంచి ప్రజలను మేల్కొలిపి వారిని మంచిమార్గం వైపు మళ్లించడమే హేతువాద ఉద్యమ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. హేతువాదులు, ప్రశ్నించేవ్యక్తులు, జర్నలిస్టులపై పలువురు దాడులకు పాల్పతుండటం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ హేతువాది, రచయిత త్రిపురనేని రామస్వామి జయంతి సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళా క్షేత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా మాట్లాడటం, ప్రచారం చేయడమే నేరమైతే, లేనిదాన్ని ఉన్నట్లు..అబద్ధాలను నిజం చేయాలని చూడటం పెద్ద సామాజిక నేరమని పేర్కొన్నారు. త్రిపురనేని తన ఇంటిని ఒక సాహిత్య కేంద్రంగా మార్చారని, సూత పురాణం, సంభూక వధ, వివాహ విధి వంటి సాహిత్యాన్ని అందించారని గుర్తు చేశారు. నాడు తెనాలి పురపాలక సంస్థ చైర్మన్‌గా ఉన్న రోజుల్లో సమాజంలో నెలకొన్న మూఢ విశ్వాసాలపై తనదైన కోణంలో యుద్ధం చేశారని వివరించారు. కార్యక్రమానికి అరసం కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించగా, త్రిపురనేని వారసుడు హితేష్ మాట్లాడుతూ 2019లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతికశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం త్రిపురనేని జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాల్సి ఉండగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాస్తిక సమాజం కార్యదర్శి కె కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 8,9 తేదీలలో మంగళగిరి చార్వాక ఆశ్రమంలో నాస్తిక మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొట్లూరి పూర్ణేందు మౌళి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధి కారి ఆర్.పిచ్చయ్య, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత కవిరాజు త్రిపురనేని విగ్రహానికి శాలువా కప్పి నివాళులర్పించారు. అనంతరం ఆయన సాహిత్యం నుంచి సేకరించిన కవితా సంకలనం 'ధూర్త మానవ' పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ధూర్తమానవ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న త్రిపురనేని స్మారక కమిటీ సభ్యులు

జనావాసాల మధ్య వైన్‌షాపును తొలగించండి సారూ!

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం చెరువు సెంటర్‌లో నివాసాల మధ్య శ్రీనివాస వైన్ షాపు ఏర్పాటు చేయటంపై చుట్టుపక్కల నివాసితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వైన్‌షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వైన్‌షాపును తొలగించాలని కోరుతూ స్థానికులంతా కలిసి ఇప్పటికే ఎక్సైజ్ మంత్రితోపాటు కమిషనర్, భవానీపురం ఎక్సైజ్ సీఐ, , పశ్చిమ తహసిల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికుడు వానపల్లి ప్రభు భాస్కర్ మాట్లాడుతూ తన ఇంటి పక్కనే వైన్‌షాపు ఏర్పాటు చేయడంతో తమతోపాటు స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైన్‌షాపు షట్టర్‌కు ముందు ఒక బడ్డీ కొట్టును ఏర్పాటు చేయించి గ్లాసులు, వాటర్, ఇతర ఆహారపదార్థాలు అమ్ముతుండటంతో మందుబాబులు పక్కనే ఉన్న తమ నివాసాల గేట్ల ముందు కూడా కూర్చుని మద్యం సేవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో కుటుంబసభ్యులు ఇంట్లోకి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తుంన్నారు. ఈవిషయంపై అభ్యంతరం చెబితే మందుబాబులు గొడవలకు దిగుతున్నారని అన్నారు. పోలీసులు వచ్చి హెచ్చరించినపుడు మందుబాబులు వెళ్లిపోతున్నారని, మిగిలిన సమయంలో మాత్రం తమ ఇళ్ల ఎదుటే మద్యం తాగుతూ ఇబ్బందిపెడుతున్నారని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న ఈవైన్‌షాపును ఇక్కడి నుంచి తరలించాలని కోరారు.



చెరువు సెంటర్ మెయిన్‌రోడ్‌పై ఉన్న వైన్‌షాపు ముందే మద్యం తాగుతున్న కస్టమర్లు

ఆదమరిస్తే.. అంతే సంగతులు

- సీబీఆర్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- ప్రమాదానికి ఓపెన్ డ్రెయినే కారణం
- డ్రెయిన్‌పై రక్షణగా వేసిన ఐరన్ గ్రిల్స్ చోరీ
- ఆందోళనలో స్థానికులు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా సెంటర్ నుంచి చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ వంతెనకు ఎడమవైపున ఉన్న సర్వీస్ రోడ్‌లో ప్రమాదం పొంచి ఉంది. సుమారు ఆరు అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న సర్వీస్‌రోడ్డులో సితార సెంటర్ నుంచి కబేళా సెంటర్ వరకుగల మురుగునీరు ఉప్పరవాగు సెంటర్ వరకు సక్రమంగా పారుదల అయ్యేలా నగరపాలక సంస్థ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించింది.

ఈ ఆరు అడుగుల ఇరుకురోడ్డులోనే ద్విచక్ర వాహనాలతోపాటు మితిమీరిన వేగంతో వచ్చే మినీలారీలు, ట్రాక్టర్లు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి ఓపెన్ డ్రెయిన్‌లో పడిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

ఐరన్ గ్రిల్స్, తలుపులు చోరీ..

ప్రజల రక్షణ కోసం నగరపాలకసంస్థ కొన్నేళ్ల కిందట డ్రెయిన్‌కు ఐరన్ మెష్ ఏర్పాటు చేసింది. డ్రెయిన్‌లో సిల్ట్ తీసేందుకు అక్కడక్కడ ఐరన్ తలుపులు కూడా ఏర్పాటు చేశారు. ఉప్పరవాగు సెంటర్‌కు ఇవతల కొంతమేర ఐరన్ మెష్ వేయకుండా వదిలేశారు. అగంతకులు ఈ ఐరన్ మెష్ ఎత్తుకుపోవడంతో డ్రెయిన్‌పై అక్కడక్కడా ఖాళీగా ఏర్పడింది. కొందరు మందుబాబులు, ఆకతాయిలు రాత్రివేళల్లో వీధిలైట్లు సరిగ్గా వెలగకపోతుండటంతో డ్రెయిన్‌పై ఉన్న ఐరన్ గ్రిల్స్ ఎత్తుకు పోయి స్క్రాప్‌కు అమ్ముకుంటున్నారు.మరో వైపు ఓపెన్‌గా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానికులు పనులు ముగించుకుని రాత్రి సమయాల్లో ఇళ్లకు చేరుకునే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా నడిచి వెళ్లే వృద్ధులు, మహిళలు ఎదురుగా, పక్కగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో కంగారుపడి డ్రెయిన్‌లో పడిపోడుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రెయిన్‌పై ఖాళీగా ఉన్న ఖానాలపై ఐరన్ మెష్ చోరీకి గురికాకుండా పటిష్టంగా ఏర్పాటు చే యాలని స్థానికులు కోరుతున్నారు. ఐరన్ మెష్ లేని ప్రాంతాల్లో వెంటనే మెష్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.





ప్రమాదభరితంగా మారిన సర్వీస్‌రోడ్‌లోని ఓపెన్ డ్రెయిన్

ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలి..



సీవీఆర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాల రద్దీ సమయంలో పాదచారులు రోడ్డుపక్కన అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పడిపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– పెంటి నాగరాజు, కబేళా సెంటర్



ఓపెన్ డ్రెయిన్‌పై పలుచోట్ల గ్రిల్స్ చోరీకి గురై ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం



తగిన రక్షణ చర్యలు లేకపోవడంతో ఆమధ్య ఓపెన్ డ్రెయిన్‌లో పడిన ఇసుక లారీ(ఫైల్)

• నిర్మానుష్యంగా రహదారులు





సంక్రాంతి పండుగ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలోని పలు రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కనకదుర్గ ఫ్లై ఓవర్ వాహనాలు రాకపోకలు సాగించక వెలవెలబోయాయి. అలానే ప్రకాశం బ్యారేజీ సైతం అటు వాహనదారులు, ఇటు సాధారణ ప్రజలు తిరగక వెలవెలబోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ